


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## దైవ సహాయం

**అరగంట పూజ చేసి,** మందిరంలోని డజనుమంది దేవతలని ప్రార్థించి, బుజ్జగించి, బతిమాలి, కోప్పడి పూజ గదిలోంచి బయటకి వచ్చింది విశాల.

పేపర్ చదువుకుంటున్న భర్త చేతిలో అరటిపండు పెట్టి దీర్ఘంగా నిట్టూర్చింది. "పోనీ ఏ జామపండో ప్రసాదంగా పెట్టకపోయావు?" జాలిగా చూస్తూ చెప్పాడు సీతారాం.

"ఆంజనేయస్వామికి అరటిపండే ఇష్టంట. మరి అదేగా పెట్టాలి?"

"మరి మిగిలిన ముక్కోటి దేవతల మాటేమిటి?"

"ఏమో! నాకు తెలీదు. ఆంజనేయస్వామి మాత్రం అరటితోటల్లోనే ఉంటాడని చదివా" విశాల భర్త ఎదురుగా కూర్చుని కుర్చీలో వెనక్కి వాలింది.

"అరటి తోటల్లో ఉండేవాడు నువ్వు పెట్టే ఈ అరటిపండుకోసం వస్తాడంటావా?" సీతారాం సందేహంగా అడిగాడు.

"కిందకూర్చుని ప్రార్థించి, ప్రార్థించి నా నడుములు పడిపోతున్నాయ్. లైన్‌గా అందరు దేవతలని పేరుపేరునా స్మరిస్తా. సాయిబాబా దగ్గరకొచ్చేసరికి పక్కనే ఉన్న సుబ్రమణ్యుడ్ని ప్రార్థించానా లేదా అని సందేహం వస్తుంది. దాంతో మళ్ళీ అందర్నీ వరసగా ప్రార్థించాలి. నా సగంరోజు ఈ పూజలకే ఖర్చయిపోతోంది. మీరేమో నా అరటిపండు కోసం ఆంజనేయుడు రాడు అంటారు. నేనేం చావాలి? అప్పటికీ ఇష్టమైంది వదులుకుంటే, అనుకున్న పని అవుతుందని ఎవరో చెప్తే, నా ప్రియాతి ప్రియమైన అరటిపండుని వదిలేసాను" ఆక్రోశంగా చెప్పింది.

"అవును అందుకేగా పాపం రోజూ నాకే ఇస్తున్నావు" సీతారాం అరటి తొక్కని దూరంగా మట్టిలోకి విసిరేస్తూ చెప్పాడు.

"అనకూడదుకాని మీ అమ్మగారున్నంతకాలం ఇంతే" విశాల గొంతు తగ్గించి చెప్పింది.

"ఛ ఛ అదేం మాట" సీతారాం నొచ్చుకున్నాడు.

"నిజం చెప్పండి. అత్తగారు అడ్డుకోకపోతే ఈ పాటికి అమ్మాయి పిల్లలకి అరటిపండు తినిపించేదాన్ని కదూ?" విశాల కన్నీళ్ళతో అడిగింది.

సీతారాం బదులు చెప్పలేకపోయాడు.

సీతారాం తండ్రి రిటైరవడానికి ఏడాదిముందు ప్రమోషన్‌తో డిప్యూటీ కలెక్టర్ అయ్యాడు. సీతారాం తల్లి సుగుణశీల. భర్తముందు చేసిన ఉద్యోగాలు మర్చిపోయింది. 'డిప్టీ కలెక్టర్' అనే మాట ఆమె నాలిక చివర్లలో వేలాడుతూంటూంది. మనవరాలికి డిప్టీ కలెక్టర్‌కి దీటైన ఉద్యోగస్థుడ్ని చూడాలని ఆవిడ కోరిక.

మనవరాలు లహరి ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్‌లో ఉన్నప్పుడు ఆవిడ సంబంధాలు చూడడం ఆరంభించింది. లహరికి, లహరి తల్లితండ్రులకి నచ్చిన సంబంధాలు ఏవీ ఆవిడకి నచ్చలేదు. ప్రతీ ఒక్కళ్ళకి వంకలు పెడుతూ, మనవరాలికి నవమన్మధుడితో పెళ్ళి చేయాలని ఆశపడుతూంటుంది.

లహరి చదువు పూర్తి చేసి, ఉద్యోగంలో చేరి రెండు ప్రమోషన్స్ కూడా తీసుకుంది. ఆమెతో పనిచేసే ఒకరిద్దరు కుర్రాళ్ళు పెళ్ళి చేసుకుంటామని ముందు కొచ్చారు కానీ సుగుణశీల దృష్టికి ఆనలేదు.

కూతురు ఈడు పిల్లలంతా పెళ్ళిళ్ళు చేసుకుని, పిల్లా పాపలతో కళకళలాడుతూ తిరుగుతూంటే, కూతురు మోడుగా ఆఫీస్‌కి వెళ్ళొస్తోందని విశాలకి చెప్పలేని బాధ. అత్తగార్ని ఎదిరించలేదు. భర్త తల్లి మాటకి ఎదురు చెప్పడు. ప్రతీ సంబంధానికి వంకలు పెడుతూంటే, పెళ్ళెప్పుడు అవుతుందని విశాల బాధ. దాంతో ఆమె దేవుడ్ని ఆశ్రయించింది. తన బాధంతా ప్రతీరోజు ఆ మందిరంలోని దేవుళ్ళకి విన్నవించుకుంటుంది.

'ఆ కుర్రాడి ముక్కు మరీ అంత బండగా ఉందేంటి?'

'వీడు మరీ ఎండునక్కలా ఉన్నాడు'

'వీళ్ళ నాన్న గుమాస్తాట. డిప్టీ కలెక్టర్ మనవరాలు గుమాస్తా కొడుకుని చేసుకోవడం ఏమిటి?'

'ఈ అబ్బాయి మరీ ఎర్రగా కోతిలా ఉన్నాడు'

'వీడు మరీ నల్లగా బొగ్గులా ఉన్నాడు'

'ఈ అబ్బాయి మరీ ఎత్తు తక్కువ. మన పాపాయి అంతే ఉంటాడు. కనీసం ఆరడుగులు ఉండొద్దా?'

'తండ్రిలేడుట. ఏం సంబంధం? మనకొద్దు'

'వీడి జీతం మన పాపాయ్ కంటే తక్కువ'

'వీడు హుందాగా లేడు. ఆ నవ్వేంటి అంత వెకిలిగా ఉంది.'

లోపాలు ఎంచడంలో సుగుణశీల అలసిపోలేదు కానీ, లహరి వయసు పెరుగుతున్న కొద్దీ సంబంధాలు రావడం తగ్గిపోయింది. మొదటిసారి పెళ్ళి చూపులకి వచ్చిన అబ్బాయ్ కొడుకు టెన్త్ క్లాస్‌లోకి వచ్చాడు మరి!

లహరి ఇంట్లోనివాళ్ళతో మాట్లాడటం తగ్గించేసింది. విశాల పూజలు ఎక్కువ చేసింది. సుగుణశీల వెబ్‌సైట్లలో కూడా పెళ్ళి సంబంధాలకోసం గాలిస్తోంది.

పూజ మధ్యలోంచే విసురుగా లేచి వచ్చి చేతిలోని అరటిపండుని తింటూ ఎదురుగా కూర్చున్న విశాలని చూసి సీతారాం నిర్ఘాంతపోయాడు.

"అదేంటి? అప్పుడే వచ్చేసావే? ఇంకో గంటైనా సాగుతుందిగా పూజ? పొరపాటున బనానా తినేస్తున్నావ్" అరిచాడు.

"అవును తింటాను. మొక్కులు మానేసాను. నేను బనానా తినకపోడానికి, లహరి పెళ్ళికావడానికి ఏం సంబంధం లేదని అర్థమైంది. అసలు దేవుళ్ళని నమ్మడం కూడా మానేసా. ఈ క్షణం నుంచి నో పూజలు. నో పునస్కారాలు" కోపంగా చెప్పింది విశాల.

"నీకేమైనా పిచ్చా? ఏం మాటలవి?" సీతారాం కోప్పడ్డాడు.

"మరి? పిల్లకి ఇరవైఏళ్ళప్పటినించి సంబంధాలు చూస్తున్నాం. దానికి ఇప్పుడు ముప్పై ఐదేళ్ళు! ఏం చేసారీ దేవుళ్ళంతా? ఎన్నెన్ని పూజలు? నోములు? వ్రతాలు? పేరు పేరునా దేవుళ్ళందర్ని ప్రార్థించాం. ఒక్కళ్ళూ కరుణించలేదు. నాకు విరక్తి పుట్టింది. పదండి టిఫిన్ తిందాం"

విశాల అన్నట్లుగానే పూజలు మానేసింది. పూజగదివైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. సుగణశీల ఏదో చెప్పబోతే, ఎర్రగా చూసింది. ఆవిడ నోరెత్తలేదు.

ఆదివారం కొద్దిగా ఆలస్యంగా నిద్రలేచిన సీతారాం భార్యకోసం వంటగదిలోకి వెళ్ళాడు. లేదు. తర్వాత ఇల్లంతా తిరిగి చూసాడు. ఎక్కడా లేదు!

ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్ళిందబ్బా? అనుకున్నాడు. పదకొండు కావొస్తూండగా విశాల ఇంట్లోకి వచ్చింది.

"ఎక్కడికి వెళ్ళావ్ పొద్దున్నే?" సీతారాం అడిగాడు.

"చర్చ్‌కి."

"చర్చ్‌కా?" విభ్రాంతిగా అడిగాడు.

"అవును. మన పక్కింటి సుందరవల్లి మతం పుచ్చుకుంది కదా! ఏసు మహిమలు చెప్పింది. లహరి పెళ్ళి అవాలని ప్రార్థిస్తే మేరీమాత కరుణించి పెళ్ళయ్యేలా చేస్తుందిట. అందుకే ఆవిడతో చర్చ్‌కి వెళ్ళి ప్రార్థించి వస్తున్నా చెప్పింది విశాల.

పొట్టపట్టుకుని నవ్వాడు సీతారాం.

"ముక్కోటి దేవతలు వినలేదని కొత్త దేవతలని ట్రైచేస్తున్నావన్నమాట!"

"అవును. పెద్ద వాళ్ళేమన్నారు? మ్రొక్కిన వరమీయని వేలుపుని గ్రక్కున విడిచిపెట్టమన్నారు. అదే చేసాను." చెప్పి విశాల పూజగదిలోకి వెళ్ళి దేవుళ్ళందర్నీ తెచ్చి షోకేస్‌లో పెట్టింది. గదంతా శుభ్రంగా కడిగి గోడకి జీసస్ ఫోటో తగిలించి, తలమీద పైట కొంగుని కప్పుకుని ఐదు నిమిషాలపాటు ఏకాగ్రతతో ప్రార్థించింది.

నాలుగు రోజుల తర్వాత లహరి ఆఫీస్ నుంచి ఇంటికి వస్తూ, తనతో ఒకబ్బాయిని కూడా తీసుకువచ్చింది.

సుగుణశీలకి అతన్ని పరిచయం చేస్తూ చెప్పింది.

"బామ్మా! ఇతనికి నువ్వు వంకపెట్టినా లాభంలేదు. మేం రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాం."

ఆవిడ నిర్ఘాంత పోతూ అడిగింది. "ఎవరీ అబ్బాయి, వీళ్ళ నాన్నేం చేస్తూంటాడు?"

"లాభం లేదని చెప్పాగా బామ్మా! ఇతని పేరు జేమ్స్. మా ఆఫీస్‌లో నాతోపాటే పనిచేస్తున్నాడు. తెలుగురాదు. మళయాళీ. వీళ్ళమ్మ నర్స్. వీళ్ళ నాన్న ఫిషింగ్ బిజినెస్ చేస్తారు. పడవలున్నాయట. వీళ్ళ చెల్లికూడా నర్సే."

సుగుణశీల కోడలివైపు తిరిగి ఆవేశంగా చెప్పింది. "మేరీమాతకి మొక్కానన్నావుగా? జేమ్స్‌ని పంపించింది. మొక్కడం కూడా చేతకావాలి. 'నువ్వు క్రిష్టియన్ వైనా హిందూ పెళ్ళికొడుకుని పంపించమ్మా' అని మొక్కొద్దూ? వెళ్ళు... నీ అల్లుడికి మర్యాదలు చెయ్"

సీతారాం మరోసారి పొట్టపట్టుకుని నవ్వాడు. అందుకు తల్లి కోపం ఓ కారణమైతే, కూతురికి పెళ్ళయిందన్న ఆనందం మరో కారణం.

విశాల తలమీద కొంగు కప్పుకుని పూజగదిలోకి పరిగెత్తింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments